

నేడు స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవం

శ్రీకాకుళం : స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో రెండు అవార్డులు వచ్చినట్లు తెలిపారు. స్వచ్ఛ్ హాస్టల్ కేటగిరీలో ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల (బాలికలు) నేలబొంతు, శ్రీకాకుళం-1, స్వచ్ఛ్ ఎస్ఎల్ఎఫ్ కేటగిరీలో శ్రీ గౌరీశంకర మహిళా సమాఖ్య, వార్డు నంబర్ 26, శ్రీకాకుళం-1 వచ్చినట్లు పేర్కొన్నారు. స్వచ్ఛ్ అవార్డులు జిల్లాస్థాయిలో 14 కేటగిరీల్లో 46 అవార్డులు వచ్చాయని తెలిపారు. ఇందులో ఉత్తమ స్వచ్ఛతా హరిత అంబాసిడర్లు 5, ఉత్తమ స్వచ్ఛతా యోధులు 5, స్వచ్ఛ్ అంగన్వాడీలు 5, స్వచ్ఛ్ బస్‌స్టేషన్లు 1, స్వచ్ఛ్ ప్రభుత్వ కార్యాలయాలు 3, స్వచ్ఛ్ గ్రామ పంచాయతీలు 5, స్వచ్ఛ్ ఆస్పత్రులు 4, స్వచ్ఛ్ పరిశ్రమలు (పెద్ద/మెగా) 3, స్వచ్ఛ్ మున్సిపాల్టీలు 1, స్వచ్ఛ్ నివాస పాఠశాలలు 1, స్వచ్ఛ్ రైతుబజార్లు 1, స్వచ్ఛ్ పాఠశాలలు 5, స్వచ్ఛ్ ఎస్ఎల్ఎఫ్ఎస్ 2, స్వచ్ఛ్ గ్రామ సంస్థలు 5 అవార్డులు వచ్చినట్లు వివరించారు.

నూతనోత్తేజం

భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు



- అరుణవర్ణ శోభితమైన సోంపేట
- భారీ ర్యాలీ, బహిరంగ సభ
- ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక
- ముగిసిన సిఐటియు మహాసభలు

సోంపేటలో రెండు రోజుల పాటు నిర్వహించిన సిఐటియు 12వ జిల్లా మహాసభలు కార్మికుల్లో నూతన ఉత్తేజాన్ని నింపాయి. మహాసభల ముగింపు రోజైన ఆదివారం నిర్వహించిన భారీ ప్రదర్శనకు జిల్లా నలుమూలల నుంచి భారీగా కార్మికులు తరలివచ్చారు. డప్పు వాయిద్యాలు, కోలాటం నడుమ ప్రదర్శన కోలాహలంగా సాగింది. పని గంటల పెంపు చట్టం రద్దు, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లింపు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు 12వ మహాసభలకు సూచకంగా మహిళలు 12 జెండాలను చేతబట్టి ప్రదర్శన అగ్రభాగాన సాగారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్దకు ర్యాలీ చేరుకోగానే రైతుసంఘం నాయకులు వాళ్లపై పూలు జల్లి తమ సంఘీభావం తెలిపారు. తిరుమల థియేటర్ నుంచి గాంధీ మండపం కూడలి వరకు ప్రదర్శన అనంతరం అక్కడ బహిరంగ సభ నిర్వహించారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, సోంపేట

మందసలో ఏర్పాటు చేస్తున్న కార్గో ఎయిర్‌పోర్టుతో అదానీ అభివృద్ధి తప్ప జిల్లాకు ఒరిగిందేమీ లేదని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు విమర్శించారు. కార్పొరేట్లకు కారుచౌకగా భూములను కట్టబెట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. జిల్లాలో కేంద్ర, రాష్ట్ర మంత్రులున్నా ఎటువంటి అభివృద్ధి జరగడం లేదన్నారు. ఉపాధి లేక జిల్లా నుంచి పెద్దఎత్తున వలస వెళ్లిపోతున్నారని విమర్శించారు. రైతులకు కనీసం ఎరువులు, యూరియా కూడా అందించలేకపోతున్నారని అన్నారు. ఎమ్మెల్యేల వేతనాలు రాను పోనూ ఖర్చులు పెంచడానికి సిద్ధపడుతున్న చంద్రబాబు ప్రభుత్వం కార్మికుల వేతనాలు పెంచడానికి మాత్రం ఇష్టపడడం లేదన్నారు. అంగన్వాడీ, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు కనీస వేతనం చెల్లించకుండా శ్రమదోపిడీ చేస్తున్నాయని విమర్శించారు.



సిఐటియు సాధించిన పోరాటాల ఫలితంగానే ఆశాలకు ప్రసూతి సెలవులో మంజూరయ్యాయని గుర్తుచేశారు. ఐక్య పోరాటాలతోనే హక్కులు సాధించుకోగలుగుతామని చెప్పారు. సిఐటియు సాగిస్తున్న ఉద్యమం వల్లే విశాఖ ఉక్కు ప్రైవేటుపరం కాకుండా అడ్డుకోగలిగామన్నారు.

జిల్లాలో జీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులపై యాజమాన్యాలు చాలా అమానుషంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. యాజమాన్యాల తీరు మార్చుకోకపోతే కార్మికులు తిరగబడతారని హెచ్చరించారు. కరెంటు ఛార్జీలను పెంచారని జగన్‌ను విమర్శించిన చంద్రబాబు, ఏడాదిన్నర కాలంలోనే మూడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని విమర్శించారు. విద్యుత్ ఛార్జీల ట్రూ డౌన్ అంటూ చంద్రబాబు చెప్తున్న మాటలు పచ్చి మోసమన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ఆదానీకి లబ్ధి చేకూర్చేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం చెల్లించేందుకు అంగీకరించని జగన్‌కు ఏ గతి పట్టిందో, కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న చంద్రబాబుకూ అదే పరిస్థితి వస్తుందన్నారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం చేసిన పోరాటం వల్లే మోడీ క్షమాపణ చెప్పుకుని మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేశారని గుర్తు చేశారు. ఢిల్లీ రైతుల పోరాట స్ఫూర్తితో కార్మిక, రైతాంగ హక్కుల కోసం కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబు ప్రైవేటు జపం

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి కుమార్ మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు, కరెంటు ఛార్జీలు పెరుగుతున్నా అందుకనుగుణంగా కార్మికుల నిజ వేతనాలు పెరగడం లేదన్నారు. చంద్రబాబు ప్రస్తుతం అంతా ప్రైవేటు జపం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

కార్మిక సమస్యలపై సిఐటియు పోరాటం

సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ జీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు యాజమాన్యాలు కనీసం మరుగుదొడ్ల సౌకర్యం కూడా కల్పించడం లేదని విమర్శించారు. జిల్లాలో అన్ని రంగాలకు చెందిన కార్మికుల సమస్యలపై ఒక్క సిఐటియు మాత్రమే పోరాటం చేస్తోందన్నారు. సిఐటియు పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.గోవిందరావు మాట్లాడుతూ అభివృద్ధి చేస్తామని చెప్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో అదానీకి భూములు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. స్కీమ్‌వర్కర్లకు వేతనాలు పెంచుతామని ఎన్నికల ముందు చెప్పిన చంద్రబాబు, ఏడాదిన్నర గడిచిన ఒక్క రూపాయి కూడా పెంచలేదని విమర్శించారు.

పలు తీర్మానాలు ఆమోదం

మహాసభల సందర్భంగా పలువురు సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలంటూ తీర్మానించారు. విశాఖ స్టీల్ వ్యూహాత్మక అమ్మకం నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధులకు తీసుకోవాలంటూ మరో తీర్మానాన్ని ఆమోదించారు. స్మార్ట్‌మీటర్లు, పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని ప్రవేశపెట్టిన తీర్మానానికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. వీటితోపాటు పలు అంశాలకు సంబంధించిన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఉత్తేజపరిచిన అభ్యుదయ గీతాలు

మహాసభల సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు చంద్రయ్య, సూదనరావు, టి.రాంబాబు, ఎం.గణపతి, టి.లక్ష్మణరావు తదితరులు ఆలపించిన అభ్యుదయ గీతాలు అందరినీ ఉత్తేజపరిచాయి. ఇదిగిదిగో ఎర్రజెండారో మనకి అండ దండారో, ఏం కొనేటట్టు లేవు ఏమి తినేటట్టు లేవు అంటూ వాడిన పాటలు ఉల్లాసపరిచాయి.

నూతన కార్యవర్గం ఎన్నిక



అమ్మన్నాయుడు



తేజేశ్వరరావు

సిఐటియు జిల్లా మహాసభల్లో రెండో రోజు ఆదివారం సిఐటియు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సిహెచ్.అమ్మన్నాయుడు, ప్రధాన కార్యదర్శిగా పి.తేజేశ్వరరావును ఎన్నుకున్నారు. కోశాధికారిగా అల్లు సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా కె.నాగమణి, అల్లు మహాలక్ష్మి, కె.సూరయ్య, డి.గోవిందరావు, బి.ఉత్తర, డి.ధనలక్ష్మి, బి.మురళి, కె.కేశవరావు, టి.త్రినాథరావు, కార్యదర్శులుగా సంగారు లక్ష్మీనారాయణ, ఎన్.గణపతి, ఎన్.వి రమణ, డి.సుదర్శనం, ఆర్.ప్రకాశరావు, హెచ్.ఈశ్వరరావుతో పాటు 64 మందితో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు కె.నాగమణి, ఎ.మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ తపాలా వారోత్సవాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు జాతీయ తపాలా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు హెడ్ పోస్టాఫీసు సూపరింటెండెంట్ వి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం డివిజన్ ప్రజలకు సౌకర్యవంతమైన ఆధార్ నమోదు, అప్‌డేట్ సేవలను అందించడానికి ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు డివిజన్ అంతటా ఆధార్ క్యాంపులను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్యాంపులను శ్రీకాకుళం, ఆమదాలవలస, టెక్కలి ప్రధాన తపాలా కార్యాలయాలతో పాటు ఉప తపాలా కార్యాలయాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కాశీబుగ్గ, పాతపట్నం, శ్రీకాకుళం సమీప ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు గానూ ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మొబైల్ ఆధార్ క్యాంపులు కూడా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల 5 నుంచి 15 ఏళ్ల పిల్లలు ఆధార్ సేవలను సులభంగా పొందగలుగుతారని స్పష్టం చేశారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో పౌరులందరికీ ఆధార్ నమోదు జనాభా సంబంధిత బయోమెట్రిక్ అప్‌డేట్లు, తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఆధార్ నమోదు, 5 నుంచి 17 ఏళ్ల మధ్య వయసు గల పిల్లలకు తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలు ఉచితంగా అందించనున్నట్లు స్పష్టం చేశారు. అదనంగా 7 నుంచి 15 ఏళ్ల పిల్లల కోసం చేస్తే తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్-1కు సంబంధించి ఏడాది పాటు రుసుములను మినహాయించినట్లు తెలిపారు. పదేళ్ల లోపు ఆడపిల్లల కోసం సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు, మగ పిల్లల కోసం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను తెరుచుకునే వెసులుబాటు కూడా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. తపాలా శాఖ సాధారణ ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు, యువతకు, ఈ క్యాంపుల ద్వారా అందుబాటులో ఉన్న ఆధార్, ఆర్థిక సేవలను వినియోగించుకుని లబ్ధి పొందాలని కోరారు.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

అభివృద్ధి కోసమే ఎయిర్‌పోర్టు

- సర్వేలకు సహకరించాలి
- రైతులకు అన్యాయం జరగనీయం
- కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్, అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - పలాస, వజ్రపుకొత్తూరు

ఉద్దాన ప్రాంత అభివృద్ధి కోసమే కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణ నిర్ణయం తీసుకున్నామని కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు అన్నారు. కార్గో ఎయిర్‌పోర్టు భూసేకరణపై పలాస రైల్వే ఫంక్షన్‌హాల్‌లో రైతులతో అవగాహనా సదస్సును ఆదివారం నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సదస్సును ఎయిర్‌పోర్టు ప్రభావిత ప్రాంతాల రైతులు బహిష్కరించగా, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అనుకూల రైతులతో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ విమానాశ్రయం నిర్మాణం వల్ల అనుసంధానంగా పరిశ్రమలు వస్తాయని, ఈ ప్రాంతం అభివృద్ధి చెంది భావితరాల భవిష్యత్‌కు బంగారుబాట వేయొచ్చన్నారు. సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు నిర్మాణం వల్ల తక్కువ ధరలు పలికిన భూములు, ప్రస్తుతం ఆకాశానికి అంటాయన్నారు. వెనుకబడిన జిల్లా పేరును రూపుమాపడానికి ఇటువంటి పోర్టులను స్వాగతించాల్సిన అవసరం ఉందని చెప్పుకొచ్చారు. రెవెన్యూ అధికారులు బృందాలుగా గ్రామాలకు వస్తారని ఎయిర్‌పోర్టుకు ఎంత భూమి అవసరం, ప్రభుత్వ భూమి, ప్రైవేటు భూమి ఎంత ఉన్నది క్షేత్రస్థాయిలో ప్రాథమిక అంచనాకి సర్వే చేస్తారని చెప్పారు. సర్వేలకు ప్రజలు సహకరించాలని కోరారు. సర్వే అనంతరం ప్రణాళికాబద్ధంగా ఎంతమేర భూముల అవసరమో గ్రామసభలు నిర్వహించి అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఏ ఒక్కరికీ అన్యాయం చేసే ప్రసక్తే లేదన్నారు. రైతులను వ్యతిరేకించి ఏ పనీ చేయబోమన్నారు. ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి కోసం భూముల త్యాగం తప్పదన్నారు. సమస్యలు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సదసులో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్, ఆర్‌డిఒ జి.వెంకటేష్, టిడిపి నాయకులు వజ్జ బాబూరావు, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల రద్దీ



ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

దసరా పండగకు జిల్లాలో సొంత ప్రాంతాలకు వచ్చిన వారు ఆదివారం తిరుగు పయనమయ్యారు. దసరా సెలవులు రెండో తేదీతో ముగిసినా, వర్షాల కారణంగా ప్రయాణాలు వాయిదా వేసుకున్న వారు ఆదివారం ఉద్యోగ, ఉపాధి, చదువుతున్న ప్రాంతాలకు బయలుదేరారు. దీంతో ఒక్కసారి రద్దీగా మారింది. శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీ కనిపించింది. ఎక్కువగా విశాఖపట్నం బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. విశాఖ నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద రద్దీగా మారింది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆర్‌టిసి అదనపు బస్సులు నడిపింది. దసరా సందర్భంగా 450 బస్సులు ఆర్‌టిసి అదనంగా, ప్రయాణికుల రద్దీ ఉండడంతో కొందరు ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించారు. ఇదే అదునుగా ప్రైవేట్ ట్రావెల్స్ డిమాండ్ మేరకు టిక్కెట్ ధరలు పెంచి, ప్రయాణికులపై భారం మోపాయి. విశాఖపట్నం వెళ్లే క్యాబ్‌లకు సైతం డిమాండ్ ఏర్పడింది. జిల్లాలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం, రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు జిల్లాకు చేరుతున్నారు.

ఉద్యోగుల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు?

- బకాయిలకు సరిపడా భూములను కేటాయించాలి
- ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న సూర్యనారాయణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాన్ని తెలియజేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా నగరంలోని ఒక కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సమావేశ అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై చర్చ వచ్చిన సందర్భంలో 2024 జూన్ నాటికి రూ.25 వేల కోట్ల బకాయిలు ఉద్యోగులకు ఉన్నట్లు శ్వేతపత్రం విడుదల చేశారన్నారు. ప్రస్తుతం ఈ బకాయిలు రూ.33 వేల కోట్లకు చేరిందని చెప్పారు. ప్రభుత్వం ఈ బకాయిలను ఇప్పట్లో చెల్లించే పరిస్థితి కనిపించడం లేదని, ఎలా చెల్లిస్తుందో తెలియజేయాలన్నారు. ప్రతి ఉద్యోగికి ఎంత బకాయి ఉందో దాన్ని సర్వీస్ రిజిస్టరులో నమోదు చేసి ఉద్యోగికి సర్టిఫికెట్ రూపంలో అందజేయాలన్నారు. బకాయిలు చెల్లించలేని పరిస్థితుల్లో ఏ ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగికి ఆ ప్రాంతంలో బకాయిలకు సమానంగా భూములను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.వెంకటేశ్వర రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎస్.సోమేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎం.సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


10న మెగా జాబ్‌మేళా

శ్రీకాకుళం : జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈనెల పదో తేదీన శ్రీకాకుళం నగరంలోని అభ్యుదయ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నిర్వహించనున్న ఈ మేళాలో ఎసిఎన్ హెల్త్ కేర్, కాన్సెంట్రిక్స్, అరబిందో, కియా మోటార్స్, హెట్రో, స్పైడర్, టాటా ఎలక్ట్రానిక్స్ తదితర 18 ప్రైవేట్ కంపెనీలు పాల్గొని వెయ్యికి పైగా ఖాళీలకు నియామకాలు చేపట్టనున్నాయని వివరించారు. ఎస్ఎస్‌సి నుంచి డిగ్రీ వరకు చదివిన 18 నుండి 30 ఏళ్ల మధ్య వయసున్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకుని, రిఫరెన్స్ నంబర్, రెజ్యూమ్, ఆధార్, విద్యార్హతల ప్రతులు, ఫొటోలతో ఆరోజు ఉదయం తొమ్మిది గంటలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ 9704960160, 6301045132 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యం

- పథకాలు సద్వినియోగం చేసుకుంటే ఆర్థిక ప్రగతి
- సముద్రంలో నాచు పెంపకానికి ప్రోత్సాహం
- మత్స్యశాఖ డీడీ వై.సత్యనారాయణ





ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యమని జిల్లా మత్స్యశాఖ డిడి వై.సత్యనారాయణ తెలిపారు. సముద్రంలో నాచు పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నామని అన్నారు. జిల్లాలో 193 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందన్నారు. ఈ ప్రాంతాల్లోని మత్స్యకారులు చేపల వేట ఆధారంగా జీవనం సాగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుంటే ఆర్థికంగా ప్రగతి సాధిస్తారని చెప్పారు. మత్స్యకారుల్లో నిరంతరం ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. మరోపక్క మత్స్య సంపద అన్వేషణలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నట్లు చెప్పారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి పలు అంశాలను వెల్లడించారు.

? మత్స్యకారులు ప్రగతికి ఏ విధంగా కృషి చేస్తున్నారు?

మత్స్యకారులు ప్రగతి లక్ష్యంగా కృషి చేస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, సాంకేతిక ప్రగతి ద్వారా చేపల వేటాడటం వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నాం. సముద్రంలో నాచు పెంపకాన్ని ప్రోత్సహించి అదనపు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగు లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

? మెరుగైన ఉపాధి కల్పనకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో సముద్ర తీరం ఎక్కువ. నాచు ఉత్పత్తి పైలెట్ ప్రాజెక్టుగా కొన్ని గ్రామాలు ఎంచుకున్నాం. ఎచ్చెర్ల మండలం పొడగట్లపాలెంతీరంలో కప్పా పైకాస్ జాతి నాచు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మొదటి దశలో 500 కిలోలు తెంపకానికి చర్యలు తీసుకుంటున్నాం. దీనిద్వారా మత్స్యకార మహిళలకు ఉపాధి లభిస్తుంది.

? వలలు, ఇంజిన్లు పంపిణీకి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద వలలు, ఇంజిన్లు కంపెనీకి చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో ఇటీవల 230 మందికి రూ. 3.52 కోట్లు విలువైన వలలు, ఇంజిన్లు పంపిణీ చేశాం. అధునాతన వలలు వల్ల మత్స్య సందత ఎక్కువగా లభ్యమవుతుంది.

? వలసలు నిర్మూలనకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

మత్స్యకారుల వలసలు నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. మూలపేట పోర్టు, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, ఇతర ప్రాంతాల్లో జెట్టీలు నిర్మాణాలు పూర్తయితే స్థానికంగా ఉపాధి లభిస్తుంది. మరోపక్క అర్హత కల ప్రతి ఒక్కరికీ మత్స్యకారులు సేవలో పథకాన్ని అమలు చేస్తున్నాం. వారి ఖాతాల్లో ఏడాదికి రూ.20 వేలు వేస్తున్నాం. జిల్లాలో 11 మండలాల్లో 4,133 బోట్లపై ఆధారపడిన మత్స్యకారులు 15,548 మందికి ఈ పథకం వర్తింపజేశాం.

? మత్స్య సంపద లభ్యతకు ఎటువంటి సాంకేతికత వినియోగిస్తున్నారు?

మత్స్య సంపద ఒక చోటికి చేరేలా సాంకేతికత వినియోగిస్తున్నాం. కృత్రిమ ఆవాసాలు సముద్రంలో ఏర్పాటు చేస్తున్నాం. సిమెంట్‌తో తయారు చేసిన రిప్పును నీటిలో విడిచిపెట్టడం ద్వారా మత్స్య సంపద చేరుతుంది. ఇలా చేపలు ఎక్కువ లభ్యమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. బుడగట్లపాలెం, కొత్తముక్కాం, బడేవానిపేట, రాళ్లపేట వంటి ప్రాంతాల్లో ఈ ప్రయోగం విజయవంతంగా నడుస్తుంది. ఒక్కో సిమెంట్ దిమ్మ 500 కిలోలు ఉంటుంది. రూ.1.75 కోట్లతో ఐదు దిమ్మలు ఏర్పాటు చేశాం. మత్స్య సంపద సేకరణకు ఈ సాంకేతి పరిజ్ఞానం ఉపయోగపడుతుంది.

? మంచి సంపద ఎక్కడుందో తెలుసుకునేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

బోట్లకు ట్రాన్స్పొండర్లు ఏర్పాటు చేస్తున్నాం. జిల్లాలో 322 బోట్లను ఏర్పాటు చేశాం. సముద్ర జలాల సరిహద్దు సమాచారం, ఎక్కువ మత్స్య సంపద లభ్యమయ్యే ప్రాంతాలు తెలుస్తాయి. తద్వారా విదేశీ జలాల్లోకి బోట్లు వెళ్లే అవకాశం ఉండదు. జిపిఆర్ఎస్ సౌకర్యం వల్ల వారి ఉన్న ప్రాంతాన్ని గుర్తించి సజావుగా ఒడ్డుకు చేరే అవకాశం ఉంటుంది. సాంకేతిక పరిజ్ఞానం భవిష్యత్‌లో ఇంకా ఎక్కువగా వినియోగించే అవకాశం ఉంది.


ఎంపికైన జట్టు

జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి - టెక్కలి

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఆదివారం ఎంపికయ్యారు. నెట్‌బాల్, రగ్బీ, రోప్ స్కిప్పింగ్, షూటింగ్ బాల్ వంటి పోటీ ఎంపికలను నిర్వహించారు. ఈ పోటీలను టెక్కలి డివిజన్ ఎస్‌జిఎఫ్ ఇన్‌ఛార్జి బాడాన నారాయణరావు ప్రారంభించారు. ఈ పోటీలకు 95 పాఠశాలల నుంచి 650 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతి ఆట నుంచీ 12 మంది చొప్పున బాలురు, బాలికలను ఎంపిక చేశామని నారాయణరావు తెలిపారు. ఈ ఎంపికలో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్రస్థాయి స్కూల్ ఆట పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపికల్లో వ్యాయామ ఉపాధ్యాయులు కె.కె.రామిరెడ్డి, ఎస్.లక్ష్మణరాజా, ఎన్.కృష్ణారావు, నాగరాజు, వెంకటరమణ, లక్ష్మీనారాయణ, నీలకంఠేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

వైసిపి ఆర్‌టిఐ విభాగ కార్యదర్శిగా రామారావు

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

వైసిపి రాష్ట్ర ఆర్‌టిఐ వింగ్ కార్యదర్శిగా బద్రి రామారావును పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి నియమించారు. ఈ నియామకంపై కార్యకర్తలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని పెద్ద సవళాపురానికి చెందిన రామారావు సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఆమదాలవలస మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, యరగాం పిఎసిఎస్ అధ్యక్షునిగా సేవలందించారు. అనంతరం వైసిపిలో చేరి క్రమశిక్షణతో సేవలు అందిస్తున్నారు. రాష్ట్రస్థాయి పదవి కల్పించినందుకు అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, ఎంపిపి కెవిజి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.


కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

మండలంలోని నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003-04లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడ నుంచో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్నేహితులంతా ఒకచోట చేరి చిన్ననాటి మధుర జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. పాఠశాలలో నిర్వహించిన సన్నివేశాలు, ఉపాధ్యాయులతో, తోటి విద్యార్థులతో జరిగిన సంభాషణలు, స్మృతులను ఒకరికొకరు పంచుకున్నారు. స్నేహితుల యోగక్షేమాలు, కుటుంబ నేపథ్యాలు తెలుసుకున్నారు. విద్యాభ్యాసం నేర్పిన ఉపాధ్యాయులు నారాయణమూర్తి, గోపాలకృష్ణ, మల్లేశ్వరరావు, రాంబాబు, సింహాచలం, బాబూజీ, శ్రీనివాస్‌లకు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం అందరూ కలిసి విందు భోజనాలు చేశారు. పాఠశాలకు అభివృద్ధికి ఆర్థికసాయం అందజేస్తామని ప్రకటించారు. వివిధ హోదాల్లోని విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్య క్రమంలో పూర్వ విద్యార్థులు, పాఠశాల పూర్వ బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

తేలుకుంచిలో వన్యప్రాణి వారోత్సవాలు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మండలంలోని తేలుకుంచిలో అటవీశాఖ అధికారులు ఆదివారం వన్యప్రాణి వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అటవీశాఖ అధికారి రాము, బీట్ అధికారులు ఏటా క్రమం తప్పకుండా వస్తున్న విదేశ వలస పక్షులు సంరక్షణ అవశ్యకృత గురించి అవగాహన కల్పించారు. పర్యావరణ సమతుల్యత గురించి వివరించారు. అంతుంచిపోతున్న జాతులు వల్ల మానవ మనుగడకు ప్రమాదం పొంచి ఉందని అన్నారు. భూమిపై ప్రతి జీవీ తన వంతు పాత్ర పోషిస్తూ... జీవ వైవిధ్యం కలిగి ఉండి పర్యావరణం పరిరక్షిస్తుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, టిడిపి నాయకులు మెరుగు సూర్యనారాయణరెడ్డి, బీట్ అధికారులు వెంకటేష్, భానుమూర్తి, జోగారావు, లక్ష్మణరావు, దుర్గాదేవి, సురేష్ పాల్గొన్నారు.

అధికారులకు ప్రచార బాధ్యతలా?

ప్రజాశక్తి - టెక్కలి

కేంద్రం కొన్ని వస్తువులపై తగ్గించిన జిఎస్‌టి తగ్గింపుపై పంచాయతీ అధికారులకు ప్రచారం చేయమని ఆదేశాలు జారీ చేయడం సమంజసం కాదని టెక్కలి మాజీ నీటి సంఘం అధ్యక్షులు సత్తారు వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. జిఎస్‌టి రూపంలో ప్రజలకు మేలుచేశామని ప్రభుత్వాలు భావిస్తే ప్రజావసరాలకు వస్తువులను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. పెట్రోల్, డీజిల్ ధరలను ఎందుకు తగ్గించడం లేదని ప్రశ్నించారు. జిఎస్‌టికి పంచాయతీ అధికారులకు సంబంధం ఏమిటని, వారు ఎందుకు ప్రచారం చేయాలో చెప్పాలని కోరారు. పాలకులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు.


పూడికలను తొలగిస్తున్న ప్రొక్లెయినర్

పూడికలు తొలగింపు

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలోని కొండపై భాగంలో మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి రాళ్లు, మట్టి రోడ్డుపై పడిపోయాయి. దీంతో గిరిజనుల రాకపోకలకు అసౌకర్యం కలిగింది. మండల గిరిజన సంఘ నాయకులు బైరిసింగి ధరణి స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి ఆదివారం ప్రొక్లెయినర్‌తో బండరాళ్లు, పూడికలను తొలగించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాణాలకు ముప్పు.. కలగదా కనువిప్పు

రహదారులే యమపాశాలుగా మారుతున్నాయి. ఈ రహదారులపై ప్రయాణం ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. వాహనదారులకు భద్రత కరువైంది. గుంతలు లేని రహదారులను చేస్తామని ప్రకటనలు గుప్పించిన కూటమి ప్రభుత్వం నేడు ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. దీంతో మండల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

- **చెరువులను తలపిస్తున్న రహదారులు**
- **గోతుల రోడ్లతో అనునిత్యం అవస్థలే**

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని రహదారులు వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. మరోవైపు ఈ రహదారులపై ప్రయాణం వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. ఏ రోడ్డు చూసినా ఏమున్నది గర్వకారణం రహదారులన్నీ గోతులమయం అన్న చందంగా మండలంలోని ప్రధాన రహదారులన్నీ తయారయ్యాయి. పాలకొండ - శ్రీకాకుళం ప్రధాన రహదారితో పాటు గ్రామీణ రహదారులు కూడా ప్రమాదాలకు హేతువుగా మారాయి. రహదారిపై ఉన్న గోతులు మృత్యు కూపాలుగా మారాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన ఆర్‌అండ్‌బి అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంతో అధికారులకు కనువిప్పు కలగదా అని మండల ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. మండలంలోని కొల్లివలస జంక్షన్ వద్ద పెద్దగొయ్యి చెరువును తలపించడమే కాకుండా వాహనదారులకు అవస్థలు కలగడంతో పాటు ప్రమాదాలకు గురవుతున్నారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని గోతులమయంగా ఉన్న రహదారులన్ని చెరువులను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు కూడా ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. కొల్లివలస నుంచి గుత్తావల్లి వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతుల్లో శనివారం ఒక మహిళ తన ద్విచక్ర వాహనంతో దిగిపోవడంతో తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా నాగావళి నది నుంచి అనునిత్యం ఇసుకను తరలిస్తున్న భారీ వాహనాల రాకపోకలతో రహదారులన్నీ గోతులమయంగా తయారయ్యాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ రహదారిపై కేవలం 20 టన్నుల వరకు లోడుతో లారీలు, వాహనాలు ప్రయాణం చేయాల్సి ఉన్నప్పటికీ ప్రతిరోజు 60 టన్నులకు మించి ఇసుకలోడ్లుతో వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్లన్నీ గోతులమయంగా తయారయ్యాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు సందర్భాల్లో ఇసుక లారీలను అడ్డుకోవడం జరిగిందని, పూర్తిస్థాయిలో దీనిపై అధికారులు చర్యలు తీసుకోకపోతే తాము ఆందోళన చేపడతామని స్పష్టం చేసినప్పటికీ ఆర్‌అండ్‌బి అధికారులు, ఇతర శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పగలు, రాత్రి తేడా లేకుండా వాహనాలు రాకపోకలు కొనసాగించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయం గుప్పెట్లో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నారాయణపురం, చిన్న లంకాం, పెద్ద లంకాం, చీడివలస, కొల్లివలస, గుత్తావల్లి, లాభాం నుంచి ఇతర జిల్లాలకు ఇసుక లారీలు వెళ్తు ఒడడంతో ఈ సమస్య జఠిలమవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. దశాబ్దాల కాలంగా ప్రజా ప్రతినిధులకు, అధికారులను విన్నవించుకోగా ఏర్పాటు చేసిన రహదారులు కేవలం అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా రహదారులన్నీ రాళ్లుతేలి, గోతులతో దర్శనమిస్తున్నాయని, ఇసుక లారీలతో రోడ్లన్నీ గోతులుగా మారిపోయినప్పటికీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అధికలోడ్లుతో ప్రయాణం కొనసాగిస్తున్న లారీలను అరికట్టాలని, అలాగే గోతులుగా మారి ప్రమాదాలకు కారణమవుతున్న రహదాలను బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


కొల్లివలస జంక్షన్‌లో అధ్వానంగా ఉన్న రహదారి


గుత్తావల్లి రహదారిలో గోతిలో దిగిపోయిన మహిళ

జాడ లేని అధికారులు



ఆర్‌అండ్‌బి శాఖ అధికారుల జాడే లేకపోవడంతో రహదారులకు శాపంగా మారింది. రహదారులన్నీ అధ్వానంగా తయారవ్వడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులు బాగుకు చర్యలు తీసుకోవాలి.

- పి.వీరస్వామి, చీడివలస

అవస్థలు తప్పడం లేదు



గ్రామాల్లోని రహదారులు అధ్వానంగా ఉన్నాయి. పాఠశాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నాం. గోతుల రోడ్లమీద ప్రయాణం చాలా కష్టంగా ఉంది. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రమాదాల బారిన పడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకుని రహదారులను బాగు చేయాలి.

- జడ్డు రవణమ్మ, బూర్జ మండలం

రేపు హుండీ లెక్కింపు

టెక్కలి రూరల్ : మండలంలోని రావివలసలో ఉన్న ఎండల మల్లిఖార్జున స్వామి ఆలయం హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం చేపట్టినట్లు ఆలయం కార్యనిర్వహణాధికారి జి.గురునాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు దేవాదాయశాఖ అధికారులు, అర్చకులు, సిబ్బంది, గ్రామ పెద్దల సమక్షంలో హుండీని తెరుస్తామని అన్నారు.


చెక్కును అందజేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

గిరిజన కుటుంబానికి రూ.8 లక్షల నష్టపరిహారం

ప్రజాశక్తి - పలాస

మందస మండలం గిరిజన గ్రామమైన సవర టుబ్బూరుకు చెందిన వృద్ధ దంపతులు సవర బుద్ధయ్య, రూపమ్ములు ఇటీవల గోడకూలి మృతి చెందారు. దీనిపై ఎమ్మెల్యే గౌతు శిరీష స్పందించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ప్రకటించారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే చేతుల మీదుగా మృతుల కుటుంబ సభ్యులకు ఆదివారం రూ.8 లక్షలు చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ మృతుల కుటుంబానికి అన్నివిధాలా ఆదుకుంటామని స్పష్టం చేశారు.


గుణస్వామికి అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

ప్రిన్సిపాల్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

2025 సంవత్సరానికి గుంటూరుకు చెందిన విఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆదివారం ఎస్‌ఎం పురం ఎపి రెసిడెన్సియల్ స్కూల్ ప్రిన్సిపాల్ గుణస్వామికి రాష్ట్రస్థాయి ఉత్తమ గురుకుల ఉపాధ్యాయ అవార్డు అందజేశారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం గుంటూరు సమావేశ మందిరంలో అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు హాజరై అవార్డు అందజేశారు.

నెలవారీ భృతి ఇవ్వాలి

నరసన్నపేట : ఆటో డ్రైవర్లకు నెలవారీ భృతి చెల్లించి ఆదుకోవాలని ఆటో, క్యాబ్, మ్యాక్సీ వర్కర్స్ యూనియన్ నియోజకవర్గ కన్వీనర్ కాల నరసింహ ఒక ప్రకటనలో కూటమి ప్రభుత్వానికి కోరారు. ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయం చూపిస్తామని మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు రూ.15 వేలు చొప్పున ఆటోడ్రైవర్ల సేవలో పథకం కింద డబ్బులు జమ చేయడాన్ని అభినందించారు. ఉపాధి కోల్పోయిన ఆటోడ్రైవర్లను ఆదుకోవాలని కోరారు.

ఆర్థికసాయం

టెక్కలి రూరల్ : సంతబొమ్మాళి మండలం పిట్టవానిపేట సముద్రతీరానికి కొట్టుకువచ్చిన అనాథ మృతదేహం ఖననం కోసం టెక్కలి అభయం యువజన సేవా సంఘం ముందుకొచ్చింది. మూడు రోజులు మార్చురీలో ఉంచినా ఎవరూ రాకపోవడంతో, పోలీసులు, పంచాయతీ కార్మికుల సహాయంతో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఖర్చును అభయం సేవా సంఘం సమకూర్చింది. ఆసరాలేని అనాథ మృతదేహాల దహన సంస్కారాలకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని వ్యవస్థాపకుడు దేవాది శ్రీనివాసరావు తెలిపారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి - లావేరు

స్థానిక శాఖ గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుద్దేశించి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను విద్యార్థులకు తెలియజేశారు ప్రాథమిక స్థాయి నుంచే రామాయణ, మహాభారతాలు, ఆధ్యాత్మిక గ్రంథాలు విద్యార్థులు చదవాలని సూచించారు. క్లాస్ పుస్తకాలకే పరిమితం కాకుండా గ్రంథాలయంలో ఉండే ప్రతి పుస్తకం విజ్ఞానానికి సంబంధించినదేనని, సెల్‌ఫోన్లుకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలి

శ్రీకాకుళం సిటీ: నగరంలోని యుటిఎఫ్ భవన్‌లో జనవిజ్ఞాన వేదిక జిల్లాకమిటీ సమావేశం జన విజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షులు, ఎడ్యుకేషన్ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల హోదా, హక్కులు, బాధ్యతలకు సంబంధించి రూపొందించిన 'స్టేటస్ ఆఫ్ ది టీచర్స్' పత్రాన్ని ఆమోదించిన అక్టోబర్ 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రపంచ దేశాలు నిర్వహిస్తాయని తెలిపారు. ఉపాధ్యాయుల స్థాయిని, గౌరవాన్ని పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ వృత్తిలో అకడమిక్ వ్యవహారాల్లో, శాస్త్రీయ దృక్పథ ప్రచారంలో కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు సత్కరించారు. జిల్లా హెచ్‌ఎంల సంఘం ప్రధాన కార్యదర్శి ఎర్నాగుల వాసుదేవరావు, ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్.సాయి శ్రీనివాస శర్మ, ఎపి జీవశాస్త్ర ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు, ఎపి మ్యాథ్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు కందుల అశోక్, ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి పైల రవికుమార్, మండల విద్యాశాఖ అధికారి సంఘం నాయకులు కె.ఎ.రాములులను ఘనంగా సత్కరించారు. కోవిడ్ సమయంలో యుటిఎఫ్ ఆఫీసు ఐసోలేషన్ సెంటర్‌గా నిర్వహించినప్పుడు బాధితులకు వైద్య సహాయం చేసిన డాక్టర్ వైష్ణవికి సన్మానం చేశారు. చెకుముకి సైన్సు సంబరాలను విజయవంతం చేస్తామని తెలిపారు. నవంబర్ 11 నుంచి 20 వరకు శ్రీకాకుళంలో జరిగే సిక్కోలు పుస్తక మహోత్సవం (సిక్కోలు సాహిత్య సాంస్కృతిక వైజ్ఞానిక సంబరాలు) విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పిలి కామేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు, జిల్లా ఉపాధ్యక్షులు పి.కుర్మారావు, జిల్లా నాయకులు హనుమంతు మన్మధరావు, ఆర్.సురేష్‌బాబు, పి.వేదవతి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కౌన్సిలర్ పొందూరు అప్పారావు, జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు


మందులను పంపిణీ చేస్తున్న గిరిబాబు

రక్త పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి - పలాస

కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో ప్రతిఒక్కరూ రక్త పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని నెఫ్రాలజిస్టు డాక్టర్ గొరకల గిరిబాబు అన్నారు. మండలంలోని గొల్లమాకన్నపల్లిలో మిషన్ ఆయుష్మాన్ ఉద్దానం, ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక సంయుక్తంగా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి బారిన పడకుండా ఉండడానికి భోజనంలో ఉప్పు తగ్గించాలన్నారు. నొప్పి మాత్రలు వేసుకోకూడదని, కూల్ డ్రింక్స్ తాగకూడదని చెప్పారు. బోర్ వాటర్‌లో సిలికా అనే పదార్థం ఉండడం వల్ల బోర్ వాటర్ తాగకూడదన్నారు. నాన్‌వెజ్‌లో మటన్ తగ్గించాలని సూచించారు. కిడ్నీ ప్రభావిత ప్రాంతంలో ప్రతిఒక్కరూ రక్త పరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రాథమిక దశలో గుర్తించడం వల్ల ఆహారం, తాగేనీటిలో మార్పులు చేసుకుంటూ మందులు వాడటం వల్ల డయాలసిస్ దశ వరకు వెళ్లకుండా జాగ్రత్త పడవచ్చు అని తెలిపారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారు డయాలసిస్ వరకు వెళ్లకుండా చేయడమే ఈ మెడికల్ క్యాంపు ప్రధాన ఉద్దేశమన్నారు. సుమారు వంద మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. యువివి అధ్యక్షులు బొమ్మాలి శివ, గౌరవాధ్యక్షులు కుత్తుం ప్రకాశరావు, ఉపాధ్యక్షులు పి.గీ తమ్మ, బి.చిన్నారావు, కె.లింగమూర్తి, జె.సీతారామయ్య, కె. వినోద్, కామేశ్వరరావు, వాసుదేవరావు, ఎం.వాసు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణ

టెక్కలి : టెక్కలి పంచాయతీ పరిధి ఎన్‌టిఆర్ కాలనీలోని వీధులకు వెళ్లేందుకు నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆనుకుని ఆక్రమణదారులు ఆక్రమించుకుంటున్నారు. వీటిని రెవెన్యూ అధికారులు అడ్డుకోవాలని ఆ ప్రాంతానికి చెందిన వారు కోరుతున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వెనుక భాగాన ఉన్న పై వీధులకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. దీనిపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని కోరగా, సిమెంట్ రోడ్డు మంజూరు చేశారు. అయితే రోడ్డు నిర్మించిన నేపథ్యంలో వాకింగ్ ట్రాక్, ఆట స్థలం కోసం విడిచిపెట్టిన ప్రాంతాన్ని ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి దురాక్రమణ చేస్తున్నారు. గడచిన రెండు దశాబ్దాలుగా లేని స్థలం ఇప్పుడు ఎలా వచ్చిందని కాలనీ వాసులు అంటున్నారు. గతంలో సదరు వ్యక్తి దురాక్రమణ చేసుకుంటే రెవెన్యూ అధికారులు తొలగింపు చేపట్టారని, ఇప్పుడు ఆ స్థలం తనదేనని చూపుతున్న పట్టాపై పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి ఆక్రమణలను తొలగించాలని ఆ ప్రాంతీయులు కోరుతున్నారు.


ఆక్రమణకు గురైన ప్రదేశం


మాట్లాడుతున్న తేజేశ్వరరావు

ఆడిటోరియం నిర్మించాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

కళాకారుల కోసం ఆడిటోరియం నిర్మించాలని కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బగాది తేజేశ్వరరావు కోరారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పేడాడ ధనుంజయరావు ఆధ్వర్యంలో సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తేజేశ్వరరావు మాట్లాడుతూ కళారంగం అభివృద్ధి కోసం, కళాకారుల కళా ప్రదర్శనల కోసం పట్టణంలో కళావేదిక (ఆడిటోరియం) నిర్మించాలన్నారు. సంఘ సహాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్దనరావు మాట్లాడుతూ పేద కళాకారులకు ఇళ్ల స్థలాలను ప్రభుత్వం మంజూరు చేయాలని, గుర్తింపు కార్డులను అందజేయాలని కోరారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఎంఇఒ కళ్లేపల్లి అప్పల రాములు ప్రదర్శించిన డప్పు వాయిద్యం, ఫ్లూట్ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాకారుల సంక్షేమ సంఘం కోశాధికారి కొంచాడ రామారావు, ఎ.రామాచారి, కూన రాములు నాయుడు, బొడ్డేపల్లి జోగారావు, దాస్యం లక్ష్మణరావు, బొడ్డేపల్లి మోహనరావు, బెండి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి గురువే మార్గదర్శి

ప్రజాశక్తి - కవిటి

గురువు సమాజానికీ మార్గదర్శిని చింతామణి సొండికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాండవ రామారావు అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని చింతామణి సొండిల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలం సొండిలకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు మొగిలిపురి సింహాచలపతి, మొగిలిపురి కృష్ణారావు, రత్నాల కుర్మారావు, మొగిలిపురి ఢిల్లేశ్వరరావులను మెమోంటోలతో సత్కరించారు. ప్రస్తుత ఉపాధ్యాయులను కూడా ఘనంగా గౌరవించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రతి మనిషీ జీవిత నిర్మాణంలో ఉపాధ్యాయుడి పాత్ర అపారమైనదని అన్నారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు మొగిలిపురి నాగేశ్వరరావు, సభ్యులు పాండవ తారకేశ్వరరావు, ఎం.రామకృష్ణ, ఎం.సీతారాం, బంగారు ధనుంజయ, ప్రశాంత్, సంతోష్, మహేష్ పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాతపట్నానికి చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్టు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పారశెల్లి రామరాజు అధ్యక్షతన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎద్దు గోపాల్ దాస్‌నాయుడు, ఎంఇఒ ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యావ్యవస్థలో ఉపాధ్యాయులు మూల స్తంభాలని, వారు సమసమాజ నిర్మాతులని కొనియాడారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. హెచ్‌ఎం ఎ.గోవిందరావు, విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గంగు కృష్ణారావు, సభ్యులు ఎన్ని తిరుపతిరావు, నరసింగ రావు, కె.శాంతారామ్, కె.విజయకుమార్, కె.చంద్రకాంత్ పాల్గొన్నారు.


కవిటి : సన్మాన గ్రహీతలతో సంఘ సభ్యులు

కొనసాగుతున్న గాలింపు చర్యలు

ఆమదాలవలస: నాగావళి నదిలో గల్లంతైన మండలంలోని కనుగులవలసకు చెందిన రైతు కూలి కొక్కిరాల నారాయుడు ఆచూకి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. శనివారం నారాయుడు నాగావళి నదిలో ప్రమాదవశాత్తు గల్లంతైన విషయం తెలిసిందే. పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన అధికారులు గత రెండు రోజులుగా నారాయణ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ఆదివారం కూడా ఎన్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక దళాలు దూసి రైల్వేబ్రిడ్జి సమీపంలో ముమ్మరంగా గాలింపు చేపట్టినప్పటికీ ఎటువంటి ఆచూకి లభించలేదు. నదిలో నీరు ఎక్కువగా ప్రవహించడం వలన గాలింపు చేపట్టినప్పటికీ ఎటువంటి ప్రయోజనం కనిపించడం లేదని అధికారులు తెలిపారు. ప్రస్తుతం నాగవళి నదిలో ఉధృతంగా నీరు ప్రవహించడం వలన బృందాల గాలింపునకు కూడా క్లిష్ట పరిస్థితులు ఏర్పడుతున్నాయని తహశీల్దార్ రాంబాబు తెలిపారు.

జూదరుల అరెస్టు

కంచిలి: మండలంలోని సూదిపుట్టుగలో శనివారం అర్థరాత్రి పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పారినాయుడు తెలిపారు. గ్రామానికి చెందిన ప్రేమ్ దొలాయికి చెందిన ఇంటి టెర్రస్‌పై పేకాట ఆడుచున్నారని సమాచారం వచ్చిందన్నారు. దీంతో రాత్రి 11 గంటలకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 13మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.92,960 నగదు, 13 సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.


కూలిపోయిన ఇంటి గోడ

కూలిన ఇంటి గోడ

ఆమదాలవలస: బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలోని చిన్న జొన్నవలసలో ఒక ఇంటి గోడ కూలిపోయింది. గ్రామానికి చెందిన గేదెల గున్నయ్య ఇంటి మట్టిగోడ వర్షపునీటితో తడిచి శని వారం రాత్రి కూలిపోయినట్లు తహశీల్దార్ రాంబాబు తెలిపారు. ఆదివారం ఉదయం జరిగిన పరిశీలనలో ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని, రెవెన్యూశాఖ తరఫున గోడకూలిన ఆస్తి నష్టాన్ని అంచనా వేసి నివేదికలను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తహశీల్దార్ తెలిపారు.


కంప్యూటర్‌ను అందజేస్తున్న సంస్థ సభ్యులు

కంప్యూటర్ వితరణ

ఎల్ఎన్‌పేట: నేతాజీ సేవా సంస్థ వారి ఆధ్వర్యాన సంస్థ సభ్యుల ఆర్థిక సహకారంతో రూ.30 వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్‌ను చింతలబడవంజ ప్రాథమికోన్నత పాఠశాలకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు సీర రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరాలని కోరారు. ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేష్ మాట్లాడుతూ వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమన్నారు. జీవితంలో ఏదైనా సాధించడానికి ఇదే ఆధారమని గుర్తించి నడుచుకోవాలని చెప్పారు. ముఖ్య అతిథి, ఇరిగేషన్ డిఇ కొత్తకోట శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు, టివిలు, సెల్‌ఫోన్లకు బందీలు కాకుండా గురువులు, పెద్దలు చెప్పే మంచి మాటలు జీవితానికి అన్వయించుకుని ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లావేటి జనార్ధనరావు, సంస్థ ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి సత్య నారాయణ, పూర్వ విద్యార్థులు చింతాడ గోవింద రావు, పూట జగన్నాథం, పూట మోహనరావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

పలాస : కాశీబుగ్గ పరిధిలో మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పలాస విద్యుత్‌శాఖ ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 33 కెవి పనులు చేపడుతున్నామని అన్నారు. కాశీబుగ్గ పరిధిలో శ్రీనివాసనగర్, పాత జాతీయ రహదారి రోడ్డు, మండల పరిషత్ కార్యాలయం, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.



కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ త్రినాథ్

ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి- కవిటి

ఉపాధి హామీ కూలీలు తప్పనిసరిగా ఇకెవైసి చేసుకోవాలని ఎంపిడిఒ త్రినాథ్ సూచించారు. మండలంలోని జాలారిపాలెంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉపాధి కూలీలు ఇకెవైసితో ముడిపడి ఉందని అన్నారు. ప్రతి కూలీ ఫీల్డ్ అసిస్టెంట్‌తో సంప్రదించి ఇకెవైసి చేసుకోవాలని సూచించారు. అనంతరం పుక్కళ్లపాలెం వద్ద పొగరుతీత పనులను పరిశీలించారు. ఆయనతోపాటు జీవన్ కుమార్ ఉన్నారు.



మాట్లాడుతున్న మన్మథరావు

వంశధార సాధన కమిటీ ఎన్నిక

మందస: మండలంలోని హరిపురం మార్పు గ్రంథాలయంలో వంశధార సాగునీరు సాధన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఉద్దాన గ్రామాలకు, వంశధార సాగునీరు పరివాహక గ్రామాలు పర్యటనకు కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అధ్యక్షునిగా మార్పు మన్మథరావు, ఉపాధ్యక్షులు ఎం.వెంకటరావు, నల్ల హడ్డి, కొర్ల హేమారావు, అంపోలు త్రినాథరావు, ఉగ్రిపిల్లి సోమనాథం, కొవ్వూరు దశరథి, వెదుళ్ల మాధవరావు, రాపాక నారాయణరావు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు

‘పోరుబాట’ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఈనెల 7వ తేదీన విజయవాడలో ఫ్యాప్టో ఆధ్వర్యాన నిర్వహించే పోరుబాట ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బమ్మిడి శ్రీరామ్మూర్తి పిలుపునిచ్చారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలైన బోధన, బోధనేతర, ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై ఫ్యాప్టో భాగస్వామ్య సంఘాల నాయకులు ఉపాధ్యాయులకు వివరించాలన్నారు. మండల కేంద్రాలు, జిల్లా కేంద్రం నుంచి ఉపాధ్యాయులను సంసిద్ధం చేసి విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద నిర్వహించే పోరుబాట ధర్నాలో పాల్గొనాలని కోరారు. ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ టిటిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 15 నెలలు కావస్తున్నా, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు గానీ 12వ పిఆర్‌సి ఏర్పాటు గానీ, నాలుగు డిఎలు పెండింగ్, కరోనాలో మరణించిన ఉపాధ్యాయుల పిల్లలకు కారుణ్య నియామకాలు లేకపోవడం తదితర సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. సమావేశంలో ఫ్యాప్టో నాయకులు వెంకటేశ్వర్లు, రామ్మోహన్, గురుగుబెల్లి రమణ , సీర రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : ఫ్యాప్టో ఆధ్వర్యాన విజయవాడలో నిర్వహించే పోరుబాట ధర్నాకు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ మద్దతు ఇస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సిమ్మినాయుడు, బొడ్డేపల్లి జనార్ధనరావు తెలిపారు. ధర్నాలో పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత ఉందన్నారు. సమావేశంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు డి.లక్ష్మణరావు బొడ్డేపల్లి జోగారావు తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న సంఘ నాయకులు

ప్రతాప్‌కు సత్కారం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మెళియాపుటికి చెందిన నలంద పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జె.జె.ప్రతాప్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం ఘనంగా సన్మానించారు. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు సుబ్రహ్మణ్యంరాజు, గౌరవాధ్యక్షులు చందు తదితరులు ప్రతాప్‌కు సత్కరించి బహుమతులు అందజేశారు. గ్రామీణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నందుకు ప్రతాప్‌ను సత్కరించారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

సంతబొమ్మాళి : గ్రామాల అభివృద్ధే ధ్యేయమని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని డి.ఎన్.పురం-ఉద్దండపాలెం రోడ్డు, డిపిఎన్-పాలతలగాం రోడ్డు, బోరుభద్ర పాఠశాల అదనపు గదులు పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెక్కలి నియోజకవర్గంలో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు చేపడుతున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి నిలిచిపోయాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం పల్లెల ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్లేంద ుకు కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గం సభ్యులు

నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని చిన్నకర్రివానిపాలెంలో దుర్గా గణేష్ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. గ్రామ యువకులు ఐక్యంగా సమావేశమై కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షునిగా సూర్ని రమేష్, కార్యదర్శులుగా సిహెచ్.బోసు, బడే మధు, ఉపాధ్యక్షునిగా ఎస్.ముకుంద, కోశాధికారిగా బడే జయబాబు ఏకగ్రవంగా ఎన్నికయ్యారు. వీరికి పూర్వ కార్యవర్గ సభ్యులు, స్థానికులు శుభాకాంక్షలు తెలిపారు.

పోరాటాలతోనే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి- కవిటి

దీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి డిమాండ్ చేశారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎపిటిఎఫ్ మండల శాఖ సర్వసభ్య సమావేశం ఆర్.కృష్ణారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

వక్తలు మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పిఆర్‌సి కమిషన్ నియమించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా బి.లక్ష్మణమూర్తి, గౌరవాధ్యక్షులుగా ఆర్.కృష్ణారావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.వంశీకృష్ణ, జి.రాంబాబు, కోశాధికారిగా పి.వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా కోళ్ల ప్రకాష్, దుర్యోధనదలై, కె.లింగరాజు, బి.మనమ్మ, జి.తిరుపతిరావు, కార్యదర్శులుగా బొడ్డ జయరాం, మార్పు వంశీ, కందాన ధర్మారావు, బాగా కృష్ణమూర్తి, ఏడుకొండలు, జిల్లా కౌన్సిలర్‌గా అప్పలనరసమ్మ ఎన్నికయ్యారు. సమావేశంలో సీనియర్ నాయకులు బల్లెడ లక్ష్మణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి డి.సరస్వతి, జిల్లా అధ్యక్షులు ఎం.మదన్ మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు పి.తిరుమలరావు, జి.భీమారావు, జిల్లా కార్యదర్శి ఎస్.చాణక్య, రాష్ట్ర కౌన్సిలర్ జి.రాజేష్, మండలశాఖ ప్రధాన కార్యదర్శి జి.రాంబాబు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి- కొత్తూరు

ఇటీవల నాగావళికి వరదనీరు రావడంతో నదీ పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. విషయం తెలుసుకున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు మండలంలోని నివగాం, సిరిసువాడ, కుంటిభద్ర, వసప, మదనాపురం, పాతపాడు, కడుము, పొన్నుటూరు, మాకువరం, కుద్దిగాం, బంకి, ఆకులతంపర, శోభనపురం ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. ఈయన వెంట బిజెపి మండల అధ్యక్షులు బురాడ భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కాపలా దమయంతి, జిల్లా కార్యవర్గ సభ్యులు చోడవరపు నరసింహామూర్తి, వసప సర్పంచ్ ఆఫీస్, మండ రామ్మూర్తి, పొగిరి రవి, చోడవరపు బాలకృష్ణ, కొంచాడ ఇళ్లంనాయుడు, సర్పంచ్ పోలీనాయుడు, ఎంపిటిసి ప్రతినిధి బిల్లింగి సంజీవరావు, మాజీ సర్పంచ్ టంకాల రమణారావు, వలురౌతు శ్యామల, సత్యం ఉన్నారు.



వసప వద్ద నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న తేజేశ్వరరావు

అధరహో లడ్డూ పాట



లడ్డూను కైవసం చేసుకున్న రాజశేఖర్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని కొండవూరులో వేద సరస్వతీ 28వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో అమ్మవారి లడ్డూ పాట ఏకంగా రూ.1,00,500 పలికింది. శనివారం రాత్రి లడ్డూ వేలం పాట నిర్వహించగా, పది మంది వరకూ పోటీ పడ్డారు. లక్షదాటి పాడిన వారంతా ఒక్కసారిగా మిన్నకుండిపోవడంతో మరో రూ.500 వరకు పెంచి లడ్డూను గ్రామానికి చెందిన కోనారి రాజశేఖర్ కైవశం చేసుకున్నారు. గతేడాది రూ.50 వేలుకు నక్క గిరధర్ కైవశం చేసుకోగా, ఈ ఏడాది రికార్డు ధర పలికిందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే వేద సరస్వతీ అమ్మవారి దేవీ వస్త్రం సైతం రూ.17,001లకు లండ నరేష్ కైవశం చేకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పలువురు ఆర్థికసాయం



వజ్రపుకొత్తూరు : చెక్కును అందజేస్తున్న సభ్యులు

వజ్రపుకొత్తూరు: మండలంలో ఉద్దానం గోపినాథపురానికి చెందిన దున్న హేమరావు వైద్యం కోసం పూండికి చెందిన యువతరం సేవా సమితి ఆదివారం రూ.25 వేలు ఆర్థికసాయం అందజేసి ఆదుకుంది. హేమారావును ఇటీవల పూండి-బెండిగేటు రహదారిలో లగేజీ వాను ఢీకొనడంతో తలకు బలమైన గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందాడు. విషయం తెలుసుకున్న యువతరం సేవా సమితి ప్రతినిధులు అతని ఇంటికి వెళ్లి పరామర్శించి చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు చింత మురళి, గొరకల సునీల్, గర్తం పుష్పలత, కె.నారాయణరావు, రాంబాబు, ఎ.లక్ష్మణరావు, రవిచంద్ర పండా, వంశీ, సాయి, వెంకటేష్ పాల్గొన్నారు.

నందిగాం: నందిగాం ఎస్‌సి కాలనీలో ఇటీవల ఎం.ఈశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబాన్ని పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. టెక్కలికి చెందిన ఎన్నారై దవళ గిరిబాబు సౌజన్యంతో రూ.3 వేలు, నిత్యవసర సరుకులు అందచేసిన జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కూరకుల యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో పళ్ల బాలకృష్ణ, కొమ్ము అరుణ్, మట్ట ప్రసాద్, సింహాద్రి సంతోష్, పళ్ల రఘుపతి పాల్గొన్నారు.